నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 నిజామాబాద్ ఆదివారం 23 మార్చి 2025 ADILABAD NIRMAL

# మౌలిక వసతులు కల్పించాలి..

- గృహజ్యోతి పథకం కింద కరెంటు మీటర్లు ఇవ్వాలి
- ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట తుడుం దెబ్బ ధర్నా


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసులు

ఎదులాపురం, మార్చి 22 : ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని సర్వే నంబర్ 72లో గల కుమ్రం భీం కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ఆదివాసులకు పట్టాలతోపాటు మౌలిక వసతులు కల్పించాలని, కాలనీ వాసులకు గృహ జ్యోతి పథకం భాగంగా కరెంటు మీటర్లు పంపిణీ చేయాలని శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట తుడుదెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో తుడుదెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేశ్ మాట్లాడుతూ.. అధికారులు అడవిలో ఉంటే టైగర్ జోన్ పేరిట వెళ్లగొడుతున్నారన్నారు. ప్రధాన గేటు ఎదుట బైటాయించి సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కొంత సేపు వీరి మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటు చేసుకున్నది. విషయం తెలుసుకున్న ఆర్డీవో వినోద్ కుమార్, రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడేప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సౌకర్యాలు కల్పించే వరకు తాము ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. కరెంట్ సౌకర్యం కల్పనకు సీఎండీకి లేఖ ఇస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు మనోజ్, గేడం రేణుక, ఉయిక ఇందిరా, సోయం లలిత, సలాం వరుణ్, పెందూర్ సంతోష్, అనసుయ బాయి, దుర్వ జుగాదిరావ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అల్టిమేటం

డబ్బులిస్తారా? ఇవ్వరా?.


"నేను చెప్పిందే వేదం.

నన్ను కాదని ఎవరూ ఏం చేయలేరు. ముందు నుంచి అధికార పార్టీని పట్టుకుని ఉంది నేను. అందుకే చెప్తున్నా.. ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి నాకు పైసలు రావాల్సిందే." అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారులకు హుకూం జారీ చేసినట్లు సమాచారం. డిపార్ట్‌మెంట్‌ను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు.. ఇలా డిపార్ట్‌మెంట్లవారీగా ఆయా శాఖల హెచ్‌వోడీలను పిలిపించుకుని ప్రత్యేక టార్గెట్‌లు ఇచ్చినట్లు తెలిసింది. మా జిల్లాలో పని చేయాలనుకుంటే నేను అడిగినన్నీ డబ్బులు ఇవ్వాల్సిందే. లేకపోతే మీరు పని చేయలేరంటూ అల్టిమేటం జారీ చేశారట. దీంతో ఆ జిల్లాలో పని చేసే ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఒత్తిడి తట్టుకోలేమని మమ్ములను ట్రాన్స్‌ఫర్ చేసినా పర్లేదు. ఇలా టార్గెట్లు పెట్టి డబ్బులు డిమాండ్ చేయడం ఏందంటూ ఆందోళన చెందుతున్నారు. సదరు ఎమ్మెల్యేను ఎలా డీల్ చేయాలో తెలియక.. కొందరు ఉన్నతాధికారులు లాంగ్ లివ్‌పెట్టి వెళ్లిపోయేందుకు సిద్ధం అవుతున్నారు. ఇలాంటి ఎమ్మెల్యేను గతంలో ఎక్కడా చూడలేదంటూ వాపోతున్నారు.

- మంచిర్యాల, మార్చి 22
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ప్రతి డిపార్ట్‌మెంట్ రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు ఇవ్వాల్సిందే..

- జిల్లా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు టార్గెట్‌లు నిర్ణయించిన నేత
- చెప్పినన్ని డబ్బులిస్తే ఉంటారు.. లేకపోతే ట్రాన్స్‌ఫర్ అవుతారు..
- హడలెత్తిపోతున్న ఆయా ప్రభుత్వ శాఖల హెచ్‌వోడీలు
- లాంగ్ లివ్ పెట్టి వెళ్లేందుకు సిద్ధమవుతున్న పలువురు అధికారులు
- కుల సంఘాలు, వ్యాపార వర్గాల నుంచి కూడా డబ్బులు డిమాండ్
- అధికార పార్టీ ఇమేజ్ డ్యామేజ్ అవుతున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆ ఎమ్మెల్యే రూటే సెపరేటు



## అయ్యా.. ఎస్ అంటేనే ఓకే..

జిల్లాలో ఆ ఎమ్మెల్యే ఏం చెప్తే అదే జరగాలి. ప్రభుత్వ నిబంధనలు ఆయనకు అసలే వర్తించవు. జిల్లా ఉన్నతాధికారులు ఆయన ఏం చెప్తే దానికి అయ్యా.. ఎస్ అనాల్సిందే. రూల్స్‌కు వ్యతిరేకంగా చేసినా చూసీచూడనట్లు ఊరుకోవాలి. లేకపోతే సార్‌కు కోపం వస్తది. అనుమతులు లేకుండానే ఏ పనైనా చేసేస్తారు. ఇష్టం లేనిది కూల్చేస్తారు. ఇష్టం వచ్చింది కట్టేస్తారు. సార్ అనుచరులైతే గవర్నమెంట్ భూములను కబ్జా చేసిన ఓకే. సార్‌కు పడనోళ్లు పర్మిషన్ లేకుండా ఒక్క ఫ్లోర్ కట్టినా అది నేలమట్టం కావాల్సిందే. సార్ చెప్పినదానికి అధికారులు ఒకే చెప్పడం తప్ప ఇప్పటివరకు జిల్లాలో నియమనిబంధనల మేరకు జరిగిన ఒక్క పని కూడా లేదు. సార్ ఏం చెప్తే అది చేస్తున్నప్పటికీ శాఖలవారీగా ఈ డబ్బులు ఇవ్వడం ఏంటన్నది ఇప్పుడు జిల్లా అధికారులకు అర్థం కావడం లేదు. ఏ పనైనా చేస్తాం తప్ప పైసలకు ఏక్కడికి పోయేది. కింద పని చేసే అధికారులను డబ్బులు అడిగితే మా పరువు ఏం కావాలి. జిల్లా హెచ్‌వోడీ సీట్‌లో కూర్చోవడమే మేము చేసిన తప్పా. ఇంతకన్నా దౌర్భాగ్యం ఏం ఉంటుందంటూ ఆయా శాఖల ఉన్నతాధికారులు బాధపడుతున్నారు. ఎమ్మెల్యే పెట్టిన పైసల టార్గెట్ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమైపోతున్నారు.

## కుల సంఘాలు, వ్యాపార వర్గాల నుంచి డిమాండ్

ప్రభుత్వ శాఖల అధికారులతోపాటు కుల సంఘాలు, వ్యాపార వర్గాలను ఆ ఎమ్మెల్యే సార్ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒకటో, రెండో చెప్పుకోదగ్గ పనులు ఏమైనా చేసిందంటే అది సారు నియోజకవర్గంలోనే. మిగిలిన నియోజక వర్గాల్లో ప్రత్యేకమైన పనులు, నిధులు ఏం లేవు. ఇటీవల ఎన్నికల కోడ్ ఉండగానే అట్టహాసంగా అన్ అఫీషియల్ ప్రారంభోత్సవం చేసిన ఓ ప్రాజెక్ట్ విషయంలో ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. గతంలో ఎవ్వరూ చేయలేనిది తాను చేశానంటూ ప్రచారం చేసుకుంటున్న సదరు నేత.. ఆ ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ కోసం కుల సంఘాలు, వ్యాపార సంఘాలను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. నేను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేసిన పని ప్రతి నెల రూ.5 లక్షలు అవసరం అవుతాయి. అందుకని మీ కుల సంఘం తరపున రూ.లక్ష ఇవ్వండి అంటూ వ్యాపారాలు చేసే ప్రధానమైన రెండు కుల సంఘాల నాయకులకు హుకూం జారీ చేశారట. ప్రభుత్వం నుంచి రూ.లక్షన్నర వస్తది. మిగిలింది చూద్దాం అంటూ చెప్పారట. ఇది ఇప్పుడు సార్ నియోజకవర్గంతో పాటు జిల్లా కేంద్రంలోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఇక జిల్లాలో మొత్తం ఎన్ని వైన్స్ షాపులు ఉన్నాయో అన్ని షాపులు నెలకు రూ.25 వేల చొప్పున ఇవ్వాలని అడిగారట. దానికి షాపుల నిర్వాహకులు సంవత్సరానికి ఒకసారంటే ఇస్తామేమో గానీ, నెలనెల ఇవ్వలేం అంటూ సార్‌ను బతిమిలాడుకున్నారని తెలిసింది. గెలిచిన ఏడాదిన్నరలో వచ్చిన మంచి పేరు ఏమో గానీ, అధికారులను, కుల సంఘాలను డబ్బులు డిమాండ్ చేయడంతో సార్‌తోపాటు అధికార పార్టీ ఇమేజ్ కూడా డ్యామేజ్ అవుతున్నది. ఇన్ని రోజులు అధికారికంగా ఏం చేసినా మిన్నకుండిపోయిన జనాలు.. ఇప్పుడు సార్ దృష్టి తమపై పడడంతో బయటికి వచ్చి ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేసిన విషయంపై తెగ ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికైనా సార్ ఆలోచన మారుతుందా? లేకపోతే డబ్బులు ఇవ్వాలనే ఒత్తిడి పెరుగుతుందా? అన్నది తేలాల్సి ఉన్నది.



# సీఎంఆర్ ధాన్యం స్వాహా

- అధికార పార్టీ నేత చేతివాటం
- రెండు సొంత రైస్ మిల్లుల్లో 26 కోట్లకు పైగా ధాన్యం మాయం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- మూడు సీజన్ల వరుస అక్రమాలపై నిర్లక్ష్యం


ఖానాపూర్ మండలం సత్తనపెల్లి గ్రామ శివారులో గల ఏఆర్ఎస్ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం (ఫైల్)

నిర్మల్, మార్చి 22(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నేత తన చేతివాటంతో దాదాపు రూ.26 కోట్ల అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలినప్పటికీ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. సదరు నేతకు సంబంధించి ఖానాపూర్ మండలంలోని సత్తనపెల్లి వద్ద గల రెండు రైస్ మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టినట్లు గురువారం నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల తనిఖీల్లో వెల్లడైంది. ఈ రైస్‌మిల్ యాజమాన్యం 2022-23 యాసంగి నుంచి మొదలుకుని గత వానకాలం సీజన్ వరకు దాదాపు 12 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా అధికారుల అండదండలతో పక్కదారి పట్టించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదరు నేతకు జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో రాజకీయ పలుకుబడి ఉన్న కారణంగా ఆయనపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు నేత గతంలో రవాణా శాఖ ఉన్నతాధికారిగా పని చేయడమే కాకుండా, ఆ శాఖకు సంబంధించిన అధికారుల సంఘం నేతగా కూడా కొనసాగారు. ఆయన గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరి ఉమ్మడి జిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ ఆయన అధికార కాంగ్రెస్ పార్టీలో ఓ ప్రాంత సీనియర్ నేతగా కొనసాగుతూ రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పుతున్నారు. ఈ నేతకు సంబంధించిన రెండు రైస్ మిల్లుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## 2022-23 యాసంగి నుంచి..

ఖానాపూర్ మండలంలోని సత్తనపెల్లిలో గల ఏఆర్ఎస్ రైస్ మిల్లులో గురువారం హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 2022-23, 2023-24 యాసంగి సీజన్లకు సంబంధించి దాదాపు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు తనిఖీల బృందం గుర్తించింది. దీని విలువ దాదాపు రూ.26 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నేతకు సత్తనపెల్లిలో ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్, ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ పేర్లతో రెండు మిల్లులు ఉన్నాయి. ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ మిల్లుకు 2022-23 యాసంగికి సంబంధించి 6,821 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో సీఎంఆర్ కోసం 4,638 మెట్రిక్ టన్నులను ఇవ్వగా, ఇప్పటి వరకు సదరు మిల్లు యాజమాన్యం కేవలం 841 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే తిరిగి ప్రభుత్వానికి ఇచ్చింది. ఇంకా 5,584 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు మిల్లులో ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 494 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నట్లు తనిఖీల్లో తేలింది. ఆ సీజన్‌కు సంబంధించి 5,500 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. అలాగే 2023-24 యాసంగికి సంబంధించి 7,430 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించగా, ఇందులో సీఎంఆర్ కోసం 5,052 ఎంటీఎస్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వాలని ఆదేశించింది. అయితే మిల్లు యాజమాన్యం మాత్రం ఇప్పటి వరకు 1,334 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చింది. సీఎంఆర్ పోగా ఇంకా మిల్లులో 5,469 ఎంటీఎస్ ధ్యాన్యం నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుత తనిఖీల్లో 2,686 ఎంటీఎస్ ధాన్యం ఉన్నట్లు గుర్తించారు. ఆ సీజన్‌లో కూడా 2,700 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం అయినట్లు తేలింది. ఇదిలా ఉంటే ఇదే యాజమాన్యానికి చెందిన మరో మిల్లు ఏఆర్ఎస్ ఆగ్రో రైస్‌మిల్‌కు 2022-23 యాసంగి సీజన్‌లో 4,317 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో సీఎంఆర్ కోసం 2,935 ఎంటీఎస్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వాలి. కాని ఇప్పటి వరకు సదరు మిల్లు యాజమాన్యం కేవలం 261 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి తిరిగి ఇచ్చింది. ఇంకా మిల్లులో 3,883 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉండాల్సి ఉండగా, ఆ సీజన్‌కు సంబంధించి ఒక్క గింజ కూడా మిల్లులో స్టాక్ లేకపోవడంతో 3,883 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. మొత్తానికి మూడు సీజన్లలో ఈ రెండు మిల్లుల నుంచి 12,202 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు తేల్చారు. కాగా ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఏఆర్ఎస్ మిల్లుల్లో నిర్వహించిన తనిఖీల్లో 12వేల ఎంటీఎస్ ధాన్యం మళ్లించినట్లు గుర్తించామని తెలిపారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం అవసరమైతే సంబంధిత యాజమాన్యంపై కేసులు నమోదు చేసి డబ్బులు రికవరీ చేస్తామని వెల్లడించారు.

# హమాలీ పేరిట వసూళ్లు

- క్వింటాలుకు రూ.50 చెల్లిస్తున్న రైతులు
- నిర్ణీత ధర కంటే క్వింటాలుకు రూ.12 అధికం
- నష్టపోతున్న రైతులు




ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో శనగ కుప్పలు

ఆదిలాబాద్, మార్చి 22(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో శనగ కొనుగోళ్లలో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. మార్కెట్ యార్డుల్లో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.5,650లతో ఆరు మార్కెట్ యార్డుల్లో కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. నాణ్యతను పరిశీలించిన పీఏసీఎస్ సిబ్బంది కొనుగోళ్లు జరుపుతున్నారు. దూర ప్రాంతాల నుంచి పంటను విక్రయించడానికి తీసుకువచ్చిన రైతులకు మార్కెట్‌యార్డులో హమాలీల సమస్య నష్టాలకు గురిచేస్తుంది. మకద్ధలం ఆధ్వర్యంలో హమాలీలు పనిచేస్తారు. జైనథ్ మార్కెట్‌యార్డులో హమాలీ విషయం చర్చనీయాంశంగా మారింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌కు డబ్బులు ఇచ్చాయనే విషయం మకద్ధంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

## క్వింటాలుకు రూ.50 వసూలు

రైతులు పంటను మార్కెట్ యార్డుకు విక్రయించడానికి తీసుకొచ్చినప్పుడు హమాలీలు అన్‌లోడింగ్, బ్యాగుల్లో నింపడం, కాంటా చేయడం, సంచులను కుట్టి లేబుల్ వేయడంతోపాటు లారీల్లో లోడ్ చేయడానికి అయ్యే ఖర్చులను చెల్లించాలి. హమాలీలు మార్కెటింగ్ శాఖ అధికారులు జారీ చేసే లైసెన్స్‌లు కలిగి ఉండాలి. పంటల విక్రయాల్లో భాగంగా హమాలీ చార్జీలను జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ నిర్ణయిస్తుంది. వ్యవసాయ, మార్కెటింగ్, కార్మిక శాఖల అధికారులతో కూడిన కమిటీ రెండు సంవత్సరాలకొకసారి సమావేశమై క్వింటాలుకు ఎంత చార్జీలు చెల్లించాలని నిర్ణయిస్తుంది. మే 4, 2023న సమావేశమైన కమిటీ క్వింటాలుకు రూ.38 హమాలీ రైతులు ఇచ్చేలా నిర్ణయించింది. ఈ ధరలు ఎక్కడ అమలు కావడం లేదు. శనగల 50 కిలోల బ్యాగును నింపి సీల్‌వేసి లోడింగ్ చేయడానికి రైతులు రూ.25 చొప్పున క్వింటాలుకు రూ.50 చెల్లించాల్సి వస్తుంది. దీంతో రైతు క్వింటాలుకు రూ.12 చొప్పున నష్టపోవాల్సి వస్తుంది.

## పట్టించుకోవడం లేదు..



నేను 80 క్వింటాళ్ల శనగలను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. పంట అమ్మకంలో భాగంగా హమాలీ చార్జీలు ఎక్కువ వసూలు చేస్తున్నారు. 50 కిలోల సంచి నింపడానికి, కాంటా వేయడానికి, కుట్టు వేయడంతోపాటు లేబుల్ పట్టడానికి, లోడింగ్ కోసం రూ.25 వసూలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.50 చెల్లించాల్సి వస్తుంది. చాయ్, పానీ ఇతర ఖర్చుల కోసం డబ్బులు అడుగుతున్నారు. 80 క్వింటాళ్లకు రూ.2 వేలు నష్టపోవాల్సి వస్తుంది. వేలాది మంది రైతులు పంటను అమ్మడానికి తీసుకొస్తారు. ఇప్పటికే అధిక రవాణ ఛార్జీలతో ఇబ్బందులు పడుతుండగా, ఎక్కువ ఛార్జీలు అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకుని నష్టపోకుండా చూడాలి.

- విలాస్‌రెడ్డి, రైతు, రాంపూర్.

# ప్రజావాణిలో అర్జీల స్వీకరణ


నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 22 : అధిక ఉష్ణోగ్రతల కారణంగా మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం ప్రతి సోమవారం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య టెలిఫోన్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలు తమ ఇంటి నుంచే ఫోన్ నంబర్ 91005 77132ను సంప్రదించి తమ సమస్యలను తెలపవచ్చని, దరఖాస్తులను వాట్సాప్ ద్వారా పంపవచ్చన్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ కార్యాలయంలో యథావిధిగా సాధారణ ప్రజావాణి ఉంటుందన్నారు.